క్లుప్తంగా

కవికి పురస్కారం


బైనా వెంకటేశ్వర్లు

ముత్తుకూరు: మండలంలోని బలిజపాళేనికి చెందిన కవి బైనా వెంకటేశ్వర్లు జాతీయ ప్రతిభా పురస్కారానికి ఎంపికయ్యారు. తెలుగు భాష, సాహిత్య పరిరక్షణకు కృషి చేస్తున్న విజయవాడలోని శ్రీశ్రీ కళా వేదిక తెలుగు అసోసియేషన్ ఆఫ్ నేషనల్ అకాడమీ బుక్ ఆఫ్ రికార్డ్స్, వరల్డ్ రైటర్స్ ఫోరం, వరల్డ్ పొయిట్రీ అకాడమీ సంయుక్తంగా ఏర్పాటు చేసిన తెలుగు కీర్తి జాతీయ ప్రతిభా పురస్కారానికి వెంకటేశ్వర్లును ఎంపిక చేసినట్లు నిర్వాహకులు కత్తిమండల ప్రతాప్ గురువారం వెల్లడించారు. వెంకటేశ్వర్లు ఈనెల 21వ తేదీన విజయవాడలో పురస్కారం అందుకోనున్నారు.

కారు బోల్తా


ఘటనా స్థలంలో కారు

పొదలకూరు: పట్టణానికి సమీపంలో నెల్లూరు మార్గం చాటగొట్ల వద్ద గురువారం కారు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో వాహనంలోని వ్యక్తులకు ఎలాంటి గాయాలు కాలేదు. స్థానికుల కథనం మేరకు.. కలువాయి మండలం దాచూరు గ్రామానికి చెందిన నలుగురు వ్యక్తులు కారులో నెల్లూరుకు వెళ్తుండగా ప్రమాదవశాత్తు చెట్ల మధ్యలో బోల్తా పడింది. ప్రమాదం జరిగిన తర్వాత నలుగురూ మరో కారులో వెళ్లిపోయారు.

బాబా మందిరంలో విశేష పూజలు



పొదలకూరు: పట్టణంలోని షిర్డీ సాయిబాబా మందిరంలో గురువారం విశేష పూజలు జరిగాయి. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. రాత్రి పల్లకిసేవ నిర్వహించారు.

వైభవంగా పల్లకిసేవ



బుచ్చిరెడ్డిపాళెం: బుచ్చిరెడ్డిపాళెంలోని షిర్డీ సాయిబాబా మందిరంలో పల్లకిసేవ గురువారం వైభవంగా నిర్వహించారు. ఈతకోట రామచంద్ర- రజనీ దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

తాగునీరు.. నేలపాలు



బుచ్చిరెడ్డిపాళెం: నగర పంచాయతీ పరిధిలో తాగునీటి వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. స్థానిక కొత్త బస్టాండ్ సెంటర్ వద్ద మెయిన్ లైన్‌పైపు పగిలిపోవడంతో తాగునీరు రోడ్డుపై పారుతోంది. దీనిపై అధికారులకు సమాచారం ఉన్నా.. వారిలో ఎలాంటి చలనం ఉండటం లేదు. ఈ పైప్‌లైన్ పగిలిపోవడంతో పెద్దారులోని పలు ప్రాంతాల్లో తాగునీటి సమస్య ఏర్పడే అవకాశం ఉంది.

రెండు కుటుంబాల మధ్య ఘర్షణ

వరికుంటపాడు: పాతకక్షల నేపథ్యంలో రెండు కుటుంబాల మధ్య ఘర్షణ జరిగి నలుగురు వ్యక్తులు గాయపడిన ఘటన గురువారం మండలంలోని జంగంరెడ్డిపల్లిలో జరిగింది. పోలీసుల కథనం మేరకు.. ఘర్షణ కారణంగా జి.కొండారెడ్డిపల్లికి చెందిన నిమర్తి శ్రీనివాసులు, ఉదయగిరికి చెందిన ఆవుల పద్మ, జంగంరెడ్డిపల్లి గ్రామానికి చెందిన నేలటూరి మహేంద్రబాబు, మహేష్‌కు గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మహేంద్ర ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రఘునాథ్ తెలిపారు.

విద్యార్థినికి ఆర్థిక సాయం

చేజర్ల: మండలంలోని ఎన్వీకండ్రిగకు చెందిన పేద విద్యార్థిని ఎస్.పుష్పలతకు యూటీఎఫ్ నాయకులు గురువారం రూ.20 వేల సాయం అందజేశారు. చేజర్లలోని యూటీఎఫ్ కార్యాలయంలో ఎంఈఓ-2 డీసీ మస్తానయ్య చేతుల మీదుగా నగదు ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ ఇడుపులపాయలోని ట్రిపుల్ ఐటీలో చదువుతున్న పుష్పలతకు ఆర్థిక సాయం అందజేసిన నాయకులను అభినందించారు. తహసీల్దార్ బీ మురళి, ఎంపీడీఓ విజయలలిత, యూటీఎఫ్ మండల నాయకులు ఎం రవిబాబు, రమణయ్య, వెంకటకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొత్త కొత్తగా..

- ఇండియన్ కోస్టుగార్డు నూతన భవనం
- రూ.30 కోట్లతో చేపట్టిన వైనం
- ఆరునెలల్లో నిర్మాణం పూర్తి
- ప్రస్తుతం అద్దె భవనంలో విధులు


కోస్టుగార్డు స్టేషన్ నూతన భవనం


నిర్మాణం పూర్తయిన మెస్ భవనం

ముత్తుకూరు: మండలంలోని 'కృష్ణపట్నం ఇండియన్ కోస్టుగార్డు స్టేషన్'కు నూతన భవనం సిద్ధమవుతోంది. ముత్తుకూరు పంచాయతీలోని బోడిస్వామికండ్రిగ సమీపాన సుమారు ఐదెకరాల విస్తీర్ణంలో కోస్టుగార్డు స్టేషన్ నిర్మాణం జరుగుతోంది. వీటితోపాటు ఉద్యోగుల క్వార్టర్స్, అన్ని వసతులతో కూడిన హాస్పిటల్, వాహనాల పార్కింగ్ తదితర భవనాల నిర్మాణాలు జరుగుతున్నాయి.

20 మందితో..

2008లో ముంబైలో దాడుల ఘటన అనంతరం చొరబాటుదారులపై నిఘా పెంచేందుకు, సముద్రం గుండా అక్రమ ప్రవేశాలను అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంది. కృష్ణపట్నం పోర్టులో కోస్టుగార్డు స్టేషన్‌ను 20 మంది సిబ్బందితో 2012లో ప్రారంభించారు. పోర్టులోని అద్దె భవనంలో నేటికీ ఇది కొనసాగుతోంది. నౌకల ద్వారా కోస్టుగార్డులు నిరంతరం బంగాళాఖాతంలో గస్తీ కొనసాగిస్తున్నారు. స్టేషన్‌ను సొంత భవనంలోని మార్చాలన్న ప్రతిపాదన రెండేళ్ల క్రితం కార్యరూపం దాల్చింది. సుమారు రూ.30 కోట్ల అంచనాలతో నిర్మాణాలు జరుగుతున్నాయి. సుమారు 80 మందికిపైగా కార్మికుల శ్రమతో సర్వాంగ సుందరంగా ఈ భవనాలు రూపుదిద్దుకుంటున్నాయి.

ఆరునెలల్లో..

ముత్తుకూరు సమీపంలో తలపెట్టిన ఇండియన్ కోస్టుగార్డు స్టేషన్, ఇతర భవనాల నిర్మాణాలు ఆరునెలల్లో పూర్తవుతాయని నిర్వాహకులు వెల్లడించారు. కాగా నేలటూరులోని ఏపీ జెన్‌కో ప్రాజెక్ట్ సమీపంలో నిర్మించిన కోస్టుగార్డు ఆఫీసర్స్ మెస్ భవనం, సింగిల్ ఆఫీసర్స్ అకామిడేషన్, స్టాఫ్ క్వార్టర్స్‌లను. విశాఖపట్నంలోని ఇండియన్ కోస్టుగార్డు ఈస్టన్ సీ బోర్డు కార్యాలయం నుంచి డిప్యూటీ డైరెక్టర్ జనరల్ గత సంవత్సరం జూలై 23వ తేదీన వర్చువల్ పద్ధతిలో వీటిని ప్రారంభించారు.


పోర్టులో అద్దె భవనంలో ఉన్న కోస్టుగార్డు స్టేషన్


నిర్మాణంలో ఉన్న ఉద్యోగుల క్వార్టర్స్

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

వెంకటాచలం: మోటార్‌బైక్ అదుపుతప్పి ఓ వ్యక్తి గాయపడిన ఘటన మండలంలోని సర్వేపల్లి సమీపంలో గురువారం జరిగింది. స్థానికుల కథనం మేరకు.. నెల్లూరు నగరానికి చెందిన నరసింహారావు పని నిమిత్తం బైక్‌పై ముత్తుకూరుకు వెళ్లాడు. తిరిగి నెల్లూరుకు వెళ్తుండగా సర్వేపల్లి సమీపంలో బైక్ అదుపు తప్పింది. ఈ ప్రమాదంలో నరసింహారావు గాయపడగా స్థానికులు గమనించి అతడిని చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించారు.

మండల సర్వసభ్య సమావేశం రేపు

కొడవలూరు : మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ గాలి జ్యోతి అధ్యక్షతన స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం జరుగుతుందని ఎంపీడీఓ ఏవీ సుబ్బారావు గురువారం తెలిపారు. ఉదయం 10.30 గంటలకు ప్రారంభమయ్యే సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, జెడ్పీటీసీ, అన్ని శాఖల అధికారులు విధిగా హాజరు కావాలని కోరారు.

రేపట్నుంచి త్యాగరాజ స్వామి ఆరాధనోత్సవాలు

కొడవలూరు : మండలంలోని నార్తురాజుపాళెంలో ఉన్న శ్రీత్యాగరాజస్వామి సంగీత కళా క్షేత్రంలో శని, ఆదివారాల్లో ఆరాధనోత్సవాలను నిర్వహిస్తున్నట్లు నాయీ బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు డాక్టర్ సుబ్రహ్మణ్యం గురువారం తెలిపారు. తొలిరోజు సంగీత కచ్చేరి, ఆదివారం మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం ఉంటుందని తెలియజేశారు. సంగీత ప్రియులు తరలిరావాలని కోరారు.

సర్వేకు సహకరించాలి


పొదలకూరు: మాట్లాడుతున్న మోహన్‌రావు


ఇందుకూరుపేట: శిక్షణలో పాల్గొన్న వైద్యాధికారులు

పొదలకూరు: ఈనెల 20 నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకు నిర్వహించే కుష్టు వ్యాధి సర్వేకు ప్రజలు సహకరించాలని డిప్యూటీ పారా మెడికల్ ఆఫీసర్ ఎం.మోహన్‌రావు కోరారు. మండలంలోని మహ్మదాపురం పీహెచ్‌సీలో గురువారం నిర్వహించిన ఎల్‌సీడీసీ సర్వేపై వైద్యాధికారి కిరణ్ రిషిత ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బందికి అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా పారా మెడికల్ అధికారి మాట్లాడుతూ అనుమానిత కేసుల వివరాలను ఆశ కార్యకర్తలు వెంటనే తెలియజేయాలని సూచించారు. ప్రతి సంవత్సరం ప్రభుత్వం నిర్వహించే ఎల్‌సీడీసీ సర్వే ద్వారా కుష్టు కేసులను గుర్తించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో విస్తరణాధికారి టి.రవికుమార్, ఆరోగ్య పర్యవేక్షకులు శ్రీనివాసులు, మస్తాన్‌బీ, నరసమ్మ తదితరులు పాల్గొన్నారు.

- ఇందుకూరుపేట : ఈనెల 20 నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకు ఇంటింటి లెప్రసీ సర్వే నిర్వహించాలని మండలంలోని వైద్యాధికారులు డాక్టర్ బ్రహ్మేశ్వర నాయుడు, డాక్టర్ కిశోర్‌కుమార్ అన్నారు. మండలంలోని జగదేవిపేట పీహెచ్‌సీలో గురువారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు పలు సూచనలు చేశారు. కుష్టు సర్వే పక్కాగా జరగాలని వివరించారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ సుధాకర్‌రావు, సూపర్‌వైజర్లు సతీష్‌బాబు, రమా, సిబ్బంది పాల్గొన్నారు.

రేగడిచెలికలో 'ఫ్యామిలీ డాక్టర్'


వైద్య బృందం

కొడవలూరు: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా ఇంటి వద్దకే ఉచిత వైద్య సేవలందిస్తున్నట్లు కొడవలూరు పీహెచ్‌సీ వైద్యాధికారి ఎం.రామకృష్ణ తెలిపారు. మండలంలోని రేగడిచెలికలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురికి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఫ్యామిలీ డాక్టర్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బృహత్తర కార్యక్రమమన్నారు. గ్రామాల్లో ఇంటి వద్దకే వైద్యులు వస్తారని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో హెచ్‌ఎస్ వి.రామ్మోహన్, హెచ్‌ఏ సీహెచ్.సుధాకర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది'


టీపీగూడూరు మండలంలో..


ఇందుకూరుపేట: క్షేత్ర సందర్శన

తోటపల్లిగూడూరు: మండలంలోని మాచర్లవారిపాళెం, వరకవిపూడిల్లో గురువారం పొలం పిలుస్తోంది కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా ఇందుకూరుపేట ఏడీఏ రాజ్‌కుమార్ మాట్లాడుతూ భూసారాన్ని నశింపజేసే రసాయన ఎరువుల బదులు సేంద్రియ ఎరువులను వినియోగించడమే శ్రేష్ఠమని సూచించారు. తీర ప్రాంత గ్రామాల్లోని నేలల్లో భాస్వరం 92 శాతం కంటే ఎక్కువగా ఉన్నందున డీఏపీ ఎరువుల వాడకాన్ని ఆపేయాలన్నారు. ఎలుకల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోకపోతే తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి శిరీషారాణి, వీఏఏలు, శశి, దయానా, ఇతర వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఎలుకల నివారణకు చర్యలు తీసుకోండి

విడవలూరు: వరి పొలంలో ఎలుకలను నివారించేందుకు రైతులు తగిన చర్యలు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి పి.వెంకటకృష్ణయ్య అన్నారు. మండలంలోని చౌకచర్ల గ్రామంలోని రైతు సేవా కేంద్రంలో గురువారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వరి పొలాల్లో ఎలుకల వల్ల రైతులు పలు సమస్యలను ఎదుర్కొంటున్నారని, వీటిని నివారించేందుకు గ్రామంలోని రైతులందరూ సామూహికంగా ఒకేసారి పంట పొలాల్లో మందును పెట్టాలని తెలియజేశారు. అనంతరం గ్రామంలోని పలువురి పొలాలను పరిశీలించి, ఉచితంగా ఎలుకల మందును అందించారు. కార్యక్రమంలో స్థానిక రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.


విడవలూరు: రైతులకు సూచనలిస్తున్న అధికారులు

జింక్ లోపాన్ని గుర్తించండి

ఇందుకూరుపేట: వరిసాగులో జింక్ లోపం ఉంటే గుర్తించాలని మండల వ్యవసాయాధికారి డి.రఘునాథ్‌రెడ్డి సూచించారు. మండలంలోని లేబూరు, జగదేవిపేట గ్రామాల్లో గురువారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుక్కిపిండి అధిక మోతాదులో వినియోగించడం, చౌడు నేలల్లో పంట వేయడం, మురుగునీరు బయటకు వెళ్లే వసతి లేకపోవడం వంటి కారణాలతో జింకు లోపాలు వస్తాయన్నారు. అనంతరం వీటి నివారణ చర్యలను వివరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సుమలత, వీఏఏలు నరేష్, సుమలత పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యల పరిష్కారానికి చర్యలు

- నెల్లూరు రూరల్ ఆర్డీఓ అనూష


చిన్నచెరుకూరులో పర్యటిస్తున్న ఆర్డీఓ అనూష

తోటపల్లిగూడూరు: ప్రజలు ఎదుర్కొంటున్న రెవెన్యూ సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు నెల్లూరు రూరల్ ఆర్డీఓ అనూష పేర్కొన్నారు. గురువారంమండలంలోని విలుకానుపల్లి, సౌత్ ఆములూరు లేఅవుట్లను పరిశీలించిన అనంతరం ఆమె చిన్నచెరుకూరు పంచాయితీ పరిధిలో 231 - 3, 231 - 4 సర్వే నంబర్లలోని రియల్ ఎస్టేట్ వ్యాపారులు వేసిన లేఅవుట్ వేసిన ప్లాట్లను చూశారు. చిన్నచెరుకూరు పంచాయతీ పరిధిలోని 231 - 3, 231 - 4 సర్వే నంబర్లలోని రియల్ ఎస్టేట్ వ్యాపారి అక్రమాలకు పాల్పడ్డాడని స్థానిక రైతు వేమారెడ్డి రాఘవరెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. అంతే కాక ఈ లేఅవుట్ ద్వారా పక్కనే ఉన్న తన పంట పొలానికి దారి కూడా మూసుకుపోయిందని చెప్పారు. స్పందించిన ఆర్డీఓ సంబంధిత లేఅవుట్‌ను పరిశీలించి స్థానికులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రసాద్, వీఆర్‌ఓ సురేష్ పాల్గొన్నారు.

కోళ్ల వ్యర్థాల లారీ స్వాధీనం



బుచ్చిరెడ్డిపాళెం: కోళ్ల వ్యర్థాలతో వస్తున్న లారీని గురువారం తెల్లవారుజామున బుచ్చిలో పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల సమాచారం మేరకు.. కర్ణాటక రాష్ట్రం నుంచి కోళ్ల వ్యర్థాలతో వస్తున్న లారీని పట్టుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి వ్యర్థాలను డంపింగ్ యార్డులో పూడ్చి వేశారు.

అన్నారెడ్డిపాళెంలో చోరీ

సంగం: ఇంట్లో ఎవరూ లేని సమయంలో తాళాలు పగులగొట్టి రూ.60 వేల విలువైన ఇత్తడి సామగ్రిని దొంగలు దోచుకెళ్లిన ఘటన అన్నారెడ్డిపాళెంలో చోటు చేసుకుంది. బాధితుల ఫిర్యాదు మేరకు వివరాలు.. అన్నారెడ్డిపాళెం గ్రామానికి చెందిన మామిళ్ల ప్రసాద్ పిల్లల చదువుల నిమిత్తమై రెండు సంవత్సరాలుగా బుచ్చిరెడ్డిపాళెంలో నివాసం ఉంటున్నారు. నిత్యం అన్నారెడ్డిపాళెం వచ్చి సాగు చేస్తున్న పొలాలను, ఇంటిని పరిశీలించి వెళ్తుంటారు. సంక్రాంతి పండగ నేపథ్యంలో నాలుగు రోజులుగా అన్నారెడ్డిపాళేనికి రాలేదు. గురువారం ఇంటికి వచ్చి చూడగా తలుపు తాళాలు పగులగొట్టి ఉన్నాయి. లోపలికి వెళ్లి చూడగా తన పూర్వీకుల నుంచి వస్తున్న ఇత్తడి సామగ్రి కనిపించలేదు. దీంతో బాధితుడు సంగం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇత్తడి సామగ్రి విలువ సుమారు రూ.60 వేలు ఉంటుందని అందులో పేర్కొన్నారు. ఈ మేరకు సంగం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్దాం

- వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు శేషగిరి


గంధం వెంకటశేషయ్యను సత్కరిస్తున్న శేషగిరి

కొడవలూరు: త్వరలో గ్రామాల్లో విస్తృతంగా పర్యటించడం ద్వారా ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్దామని వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు చిమటా శేషగిరి కోరారు. మండలంలోని గుండాలమ్మపాళెం, బసవాయపాళెం, పద్మనాభసత్రంలలో గురువారం ఆయన పర్యటించి పార్టీ నాయకులను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఆరు నెలల్లోనే ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందన్నారు. సూపర్ సిక్స్ హామీలను గాలికొదిలేయడంతో పేద, మధ్య తరగతి వర్గాలు ప్రభుత్వంపై మండిపడుతున్నారని చెప్పారు. ఆయన కలిసిన వారిలో వైఎస్సార్‌సీపీ మాజీ మండలాధ్యక్షుడు గంధం వెంకటశేషయ్య, వీరి సంపత్‌కుమార్, చల్లకొలుసు కార్తీక్, అక్కుపల్లి మహిధర్, దేగా మధుసూదన్‌రావు, సిద్దారెడ్డి నాగేంద్రరెడ్డి, కుంకాల శివారెడ్డి, తిరకాల మల్లికార్జున ఉన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కొట్టె మల్లికార్జున, బొచ్చు శ్రీనివాసులు, వి.నరసింహారావు, కె.మురళి పాల్గొన్నారు.

జెడ్పీ మైదానంలో క్రికెట్ పోటీలు



మనుబోలు: సంక్రాంతి సందర్భంగా మనుబోలు జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఎన్ఎస్ఆర్ మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్ ఉత్కంఠభరితంగా సాగుతోంది. గురువారం జరిగిన మ్యాచ్‌ల్లో దాము లెవెన్‌పై ఈస్ట్ స్ట్రీట్ లెవెన్, కొమ్మలపూడిపై బద్దెవోలు, సీపీఎల్ డ్రాగన్స్‌పై కొలనకుదురు, అక్కంపేటపై మడమనూరు, సావిత్రిపురంపై కొండూరు జూనియర్స్, కట్టువపల్లిపై బాయ్ లెవన్, కాగితాలపూరుపై మనుబోలు ఎంజీసీటీ జట్లు విజయం సాధించాయి. ఈ టోర్నమెంట్ విజేతకు రూ.20 వేలు, రన్నరప్‌కు రూ.15 వేల నగదు బహుమతి అందజేస్తారు.

రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలి


ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు, గ్రామస్తులు


గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్సై రాకేష్

మనుబోలు: వాహనచోదకులు, పాదచారులు రోడ్డు భద్రతా నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ఎస్సై శివరాకేష్ అన్నారు. రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా ఎస్పీ ఆదేశాల మేరకు మండలంలోని వీరంపల్లి గ్రామంలో గురువారం మోటార్‌బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడపొద్దని సూచించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకుని వాహనాలు నడపడం ప్రమాదకరమన్నారు. పార్కింగ్‌కు కేటాయించిన స్థలంలోనే వాహనాలను నిలపాలన్నారు. ప్రమాదాల నివారణకు రహదారులపై ఏర్పాటు చేసిన బోర్డుల్లోని సూచనలను పాటించాలన్నారు. ప్రభుత్వం నిషేధించిన వస్తువులు, మత్తు పదార్థాలను రవాణా చేయడం నేరమన్నారు.

అనుమతుల్లేకుంటే చర్యలు తప్పవు


వివరాలు తెలుసుకుంటున్న అధికారులు

ఇందుకూరుపేట: అనాథ బాలల సంరక్షణ కేంద్రాల నిర్వహణకు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని, లేకుంటే చర్యలు తప్పవని జిల్లా బాలల సంరక్షణాధికారి బి.సురేష్ సూచించారు. మండలంలోని ఇందుకూరుపేటలో బాలల సంరక్షణ కేంద్రాలను జిల్లా ప్రొహిబిషన్ అధికారి జీకే కాసీమ్‌దొరతో కలిసి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొన్ని ప్రాంతాల్లో బాలల సంరక్షణ కేంద్రాలను నిర్వహిస్తున్నారని, అయితే వాటి కోసం నమోదు(రిజిస్ట్రేషన్) చేయాలని తెలియజేశారు. లేదంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సీడీపీఓ రాజ్యలక్ష్మి, అధికారులు పాల్గొన్నారు.